ఆక్రమణదారుల బరితెగింపు




న్యూ జర్నలిస్టు కాలనీలో ఆక్రమణదారులు చదును చేసిన స్థలం, ఘటనా స్థలంలో పొక్లెయిన్

• రూ.కోట్ల విలువైన భూమిని కబ్జా చేసేందుకు యత్నం

కూటమి ప్రభుత్వంలో ఆక్రమణదారులు బరితెగించారు. నెల్లూరు రూరల్ పరిధిలోని పొదలకూరు రోడ్డు కొత్తూరు దగ్గర ఉన్న న్యూ జర్నలిస్టు కాలనీలో పట్టపగలు కొందరు దర్జాగా ఆక్రమణకు యత్నించారు. సమాచారం అందుకున్న జర్నలిస్టులు ఆక్రమణదారులను నిలదీయడంతో కబ్జాయత్నాన్ని విరమించుకుని పరారయ్యారు.

నెల్లూరు(బృందావనం): కొత్తూరు సమీపంలో కేంద్రీయ విద్యాలయం దగ్గర 2008లో వైఎస్సార్ ప్రభుత్వం 220 మంది జర్నలిస్టులకు నివేశన స్థలాలతో ప్లాట్లు కేటాయించింది. సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఆ భూమిలో తూర్పు, పడమరల వైపు రహదారులు, పార్కులు, ప్రజావసరాల కోసం కొంత స్థలం కేటాయించింది. అయితే ఇటీవల కాలంలో కొందరి ఆక్రమణదారుల కన్ను న్యూజర్నలిస్టు కాలనీపై పడింది. గురువారం మధ్యాహ్నం ఐదుగురు మహిళలతో పాటు కొందరు వ్యక్తులు న్యూ జర్నలిస్టు కాలనీకి పొక్లెయిన్‌తో వచ్చి ప్రజావసరాలు, రహదారి కోసం వదిలిన స్థలాన్ని చదును చేసేందుకు యత్నించారు. పెద్ద వేపచెట్లను పెకిలించి, సుమారు రూ.కోటి నుంచి రూ.2 కోట్ల విలువ కలిగిన 100 నుంచి 150 అంకణాలను చదును చేసేశారు.

జర్నలిస్ట్ నిలదీయడంతో..

భూ కబ్జాపై సమాచారం అందుకున్న ఓ సీనియర్ జర్నలిస్టు అక్కడికి చేరుకుని ఆక్రమణదారులను నిలదీశారు. తమకు హైకోర్టు ఉత్తర్వులు ఉన్నాయని, తమకు కలెక్టర్, ఉన్నతాధికారులు తొమ్మిది అంకణాల వంతున గృహాలను నిర్మించుకోవాలంటూ చెప్పారని, అందుకే ఈ స్థలాన్ని చదును చేసుకొంటున్నామంటూ బదులిచ్చారు. అందుకు సంబంధించిన ఉత్తర్వులు చూపాలంటూ ఆ సీనియర్ జర్నలిస్టు నిలదీయడంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకొంది. ఇంతలో రూరల్ వీఆర్వో వెంకటరమణయ్య రంగంలోకి దిగి ఆ జర్నలిస్టుతో తీవ్రస్థాయిలో వాగ్వాదానికి దిగారు. కాగా ఫొటోలు, వీడియో తీసేందుకు ఆ జర్నలిస్టు ఉపక్రమించగా, వీఆర్వో అక్కడి నుంచి చల్లగా జారుకున్నారు. ఈ క్రమంలో ఆక్రమణకు వచ్చిన వారు సైతం ఆయనతో పాటు ముఖం చాటేశారు. ఈలోగా పొక్లెయిన్ డ్రైవర్ తమను ఫొటోలు తీయవద్దని, కూలికి వచ్చామని, తనకేమీ సంబంధం లేదంటూ వెళ్లిపోయారు. ఈ విషయమై రూరల్ వీఆర్వో వెంకటరమణయ్యను సాక్షి వివరణ కోరగా తాను ఆ మార్గంలో వెళ్తుండగా మహిళలు తమకు ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందంటూ తన దృష్టికి తెచ్చారని, అందుకే వచ్చానంటూ బదులిచ్చారు. తనకు, ఆక్రమణదారులకు ఎలాంటి సంబంధం లేదన్నారు.



కూల్చివేసిన వేపచెట్టు



వాలిపోయిన విద్యుత్ స్తంభం

క్లుప్తంగా

'రంగడి'కి వెండిపాదాల బహూకరణ



నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో స్వామివారికి పకాబత్తుల సుబ్రహ్మణ్యం ఆచారి- ప్రసన్నకుమారి దంపతులు వెండి పాదములను ఈఓ ఆళ్ల శ్రీనివాసరెడ్డికి గురువారం అందజేశారు. రూ.87,360 విలువ చేసే 960 గ్రాముల రెండు వెండిపాదములను స్వామివారికి కానుకగా అందజేసినట్లు ఈఓ తెలిపారు.

కోవూరు ఎమ్మెల్యేకు బెదిరింపు లేఖ

• పోలీసుల అదుపులో నిందితుడు

నెల్లూరు(క్రైమ్): నేను మావోయిస్టు దళ కమాండర్‌ను, రూ.2 కోట్ల నగదు ఇవ్వకుంటే చంపేస్తానంటూ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని బెదిరించిన వ్యక్తిపై దర్గామిట్ట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఈనెల 18వ తేదీన గుర్తుతెలియని వ్యక్తి మాగుంట లేఅవుట్‌లోని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నివాసం వద్దకు వచ్చి భద్రతా సిబ్బందికి ఓ లేఖ ఇచ్చి వెళ్లారు. సహజంగా ప్రజలు వారి సమస్యలను పరిష్కరించమని అర్జీలు ఇచ్చి వెళ్లడం పరిపాటి కావడంతో ఆ లేఖను కార్యాలయ సిబ్బందికి అందజేశారు. కాగా ఆ లేఖను తెరచి చూడగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి రూ.2 కోట్లు ఇవ్వకపోతే చంపేస్తానని రాసి ఉంది. వెంటనే వారు ఈవిషయాన్ని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిలకు తెలిపారు. వారు పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. సాంకేతికత ఆధారంగా నిందితుడు అల్లూరు మండలానికి చెందిన వ్యక్తి అని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. సదరు వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతున్నట్లు సమాచారం.

మహిళకు అరుదైన శస్త్రచికిత్స



ఆపరేషన్ ద్వారా తొలగించిన గడ్డ

నెల్లూరు(అర్బన్): స్థానిక బృందావనంలోని తమ ఆస్పత్రిలో ఓ అవివాహితకు అరుదైన శస్త్రచికిత్స చేసి పెద్ద ఫైబ్రాయిడ్ గడ్డను తొలగించామని దీప్తి నర్సింగ్ హోమ్ వైద్యులు లోకనాథం, సుమతి తెలిపారు. ఈ మేరకు ఆస్పత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో గురువారం వివరాలు వెల్లడించారు. దగదర్తి మండలానికి చెందిన 28 ఏళ్ల అవివాహిత అయిన అశ్విని గత కొన్ని నెలలుగా రక్తస్రావం, ఎక్కువ సార్లు మూత్రవిసర్జన, వాంతులతో బాధపడుతోందన్నారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం ఆమె తమ ఆస్పత్రికి వచ్చిందన్నారు. తాము ఎంఆర్‌ఐ పరీక్ష చేయగా గర్భసంచిలో 25 సెంటీమీటర్ల గడ్డ ఉన్నట్టు తెలుసుకున్నామన్నారు. ఆ గడ్డ జనన ద్వారాన్ని కూడా పక్కకు నెట్టేసి కిందకు వచ్చిందన్నారు. దీంతో తాము రిస్క్ తీసుకుని వెజైనోప్లాస్టి ఆపరేషన్ చేసి విజయవంతంగా గడ్డను తొలగించి జనన ద్వారాన్ని సరి చేశామన్నారు. పెద్దవాళ్లకు వస్తే గర్భసంచిని తొలగిస్తామన్నారు. అయితే ఈమె అవివాహిత అయినందువల్ల వెజైనోప్లాస్టి చేశామన్నారు. కడుపు నొప్పి, రక్తస్రావం లాంటి లక్షణాలున్న స్త్రీలు మొదట్లోనే డాక్టర్‌ను సంప్రదిస్తే ఇలాంటి తీవ్రమైన సమస్యలు రావన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్‌ను ఆయిల్ ట్యాంకర్ ఢీకొని ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని తిక్కవరప్పాడు సమీపంలో గురువారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. సర్వేపల్లి గ్రామానికి చెందిన తెనాలి శేఖర్ వెంకటాచలం వైపు బైక్‌పై వెళ్తున్నారు. తిక్కవరప్పాడు సమీపంలో ఎదురుగా వచ్చిన ఆయిల్ ట్యాంకర్.. బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శేఖర్‌కు తీవ్ర గాయాలవగా, ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారయ్యాడు. శేఖర్‌ను చికిత్స నిమిత్తం ఆటోలో నెల్లూరుకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపల్ కార్మికులకూ పథకాలు అందాలి



హాజరైన మున్సిపల్ కార్మికులు, నాయకులు



మాట్లాడుతున్న మాదాల వెంకటేశ్వర్లు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మున్సిపల్ కార్మికులకూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెంచలనరసయ్య డిమాండ్ చేశారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి భవన్‌లో సీఐటీయూ రూరల్ మూడో మహాసభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో నిర్వహించిన సమ్మె సందర్భంగా మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ పథకాలు అమలు చేస్తామని, 60 ఏళ్లు దాటిన కారిక్మలకు వచ్చే బెనిఫిట్స్ అందజేస్తామని, చనిపోయిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, కానీ ఇప్పటివరకు సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయలేదన్నారు. మున్సిపల్ కార్మికులందరూ ఏకతాటిపైకి వచ్చి ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. 57 మంది సభ్యులు, 18 మంది ఆఫీస్ బేరర్లను ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా సుజాతమ్మ, దేశమూర్తి, కోశాధికారిగా వజ్రమ్మలను ఎన్నిక చేశారు. కార్యక్రమంలో సీపీఎం నగర, రూరల్ కార్యదర్శులు కత్తి శ్రీనివాసులు, కొండా ప్రసాద్, సీఐటీయూ నేతలు నరసింహారెడ్డి, సుధాకర్, నాగేశ్వరరెడ్డి, సూర్యనారాయణ, శివాజీ, మాలకొండయ్య, యూనియన్ నాయకులు సునీల్, రమాదేవి, నాగేశ్వరరావు, కామాక్షమ్మ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సత్కారం



ల్యాబ్ అటెండెంట్ శ్రీనివాసులు దంపతులను సన్మానిస్తున్న పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ మాధవి

నెల్లూరు(అర్బన్): 40 ఏళ్లుగా పెద్దాస్పత్రి, మెడికల్ కళాశాలలో ల్యాబ్ అటెండెంట్‌గా పనిచేసిన కమ్మటి శ్రీనివాసులు ఉద్యోగ విరమణ కార్యక్రమం ప్రభుత్వ వైద్య కళాశాలలోని కలామ్ సమావేశ మందిరంలో గురువారం జరిగింది. యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కొండేటి మాధవి పాల్గొని, మాట్లాడారు. ఉద్యోగ సంఘం నాయకుడిగా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తూనే.. రోగులకు అంకితభావంతో శ్రీనివాసులు సేవలు అందించారన్నారు. అనంతరం శ్రీనివాసులు దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజేశ్వరి, యూనియన్ గౌరవాధ్యక్షుడు నరమాల సతీష్, జిల్లా కార్యదర్శి సందానిబాషా, వైస్ ప్రిన్సిపల్ మస్తాన్‌బాషా, అడ్మినిస్ట్రేషన్ అధికారి కళారాణి, ప్రొఫెసర్ బెనహర్, హెచ్‌డీఏస్ కో–ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు అభినందన



నెల్లూరు(పొగతోట): స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా అవార్డులు పొందిన జిల్లా పరిషత్ ఉద్యోగులను గురువారం జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అభినందించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, అసోసియేషన్ నాయకులు లక్కాకుల పెంచలయ్య, బీమ్‌రెడ్డి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి సమష్టి కృషి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో ఉన్న జనాదరణను గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసే దిశగా అందరం సమష్టిగా కృషి చేద్దామని ఆ పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు జిల్లా నేతలకు సూచించారు. నగరంలోని జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంగ్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటగిరి, నెల్లూరు రూరల్, సూళ్లూరుపేట నియోజకవర్గాల సమన్వయకర్తలు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్యలతో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. పార్టీ బలోపేతానికి ఏర్పాటు చేయాలనుకున్న మండల, గ్రామ కమిటీలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేయాలని, దానికి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై పెడుతున్న అక్రమ కేసులను ఏ విధంగా ఎదుర్కోవాలి, అందుకు సంబంధించిన కార్యాచరణపై చర్చించారు.



మాజీ ఎంపీ మేకపాటికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కారుమూరి, జిల్లా నేతలు

మాజీ ఎంపీని కలిసిన జిల్లా నేతలు

మాజీ పార్లమెంట్ సభ్యుడు మేకపాటి రాజమోహన్‌రెడ్డిని నెల్లూరు డైకస్ రోడ్డులోని ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీ జిల్లా నేతలు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. రీజినల్ కో–ఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటగిరి, నెల్లూరు రూరల్, సూళ్లూరుపేట నియోజకవర్గాల సమన్వయకర్తలు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య తదితరులు ఉన్నారు. రాష్ట్ర, జిల్లా రాజకీయాల గురించి చర్చించారు.

114వ దఫా రక్తదానం



రక్తదానం చేస్తున్న అజయ్‌బాబు

నెల్లూరు(అర్బన్): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంకు కన్వీనర్ సీహెచ్ అజయ్‌బాబు 114వ దఫా రక్తదానం చేశారు. ఆయన తన పుట్టినరోజును పురస్కరించుకుని స్థానిక రెడ్‌క్రాస్‌లో గురువారం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా బ్లడ్ బ్యాంక్ సెంటర్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ యశోవర్ధన్ మాట్లాడుతూ అజయ్‌బాబు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తూ ఖాళీ సమయాన్ని బ్లడ్‌బ్యాంక్ కోసం కేటాయిస్తున్నారన్నారు. యువత స్వచ్ఛంద రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మోటివేటర్ అరిగెల సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

'ఆయుష్మాన్ భారత్' పథకానికి నమోదు



నెల్లూరురూరల్: 38వ డివిజన్ సోమశేఖరపురంలో ఆయుష్మాన్ భారత్ పథకం కింద 70 ఏళ్లు దాటిన వృద్ధుల కోసం ఉచిత ఆరోగ్య కార్డు నమోదు కార్యక్రమాన్ని బీజేపీ నేతలు కందుకంట్ల రాజేశ్వరి, చిలక ప్రవీణ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ పథకం కింద 70 ఏళ్లు దాటిన వృద్ధులకు ఆదాయంతో సంబంధం లేకుండా ఉచితంగా రూ.5 లక్షల వరకు ఆరోగ్య కవరేజీ పొందుతారన్నారు. కార్యక్రమంలో పార్టీ నేత కిరణ్, సుబ్బారావు పాల్గొన్నారు.


నీటి వృథాను అరికట్టండి



కాలువలో వ్యర్థాల తొలగింపు పనులను పరిశీలిస్తున్న ఎస్‌ఈ రామ్మోహన్‌రావు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో సరైన నిర్వహణలో లేని వీధి తాగునీటి కుళాయిలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని, నీటి వృథాను అరికట్టాలని ఇంజినీరింగ్ విభాగం ఎస్‌ఈ రామ్మోహన్‌రావు అధికారులకు సూచించారు. తాగునీటి సరఫరా నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక గిడ్డంగివీధి, కంశాలివీధి, కుక్కలగుంట, మున్సిపల్ వెహికల్ షెడ్డు పరిసర ప్రాంతాల్లో గురువారం ఉదయం ఆయన పర్యటించారు. వివిధ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నాణ్యతను పరిశీలించారు. నిర్దేశించిన ప్రమాణాలను పాటించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ కుళాయిలకు మూతలు లేకుండా, డ్యామేజ్ అయి, పగిలిపోయి ఉన్న వాటిని గుర్తించి వెంటనే రిపేర్లు చేపట్టాలని, అవసరమైన చోట్ల నూతన ట్యాప్‌లను బిగించాలని ఆదేశించారు. వివిధ ప్రాంతాల్లోని డ్రెయిన్ కాలువల్లో మురుగునీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న వ్యర్థాలను గుర్తించి తొలగించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఆక్రమణల తొలగింపు



నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని రాఘవ కల్యాణ మండపం ఎదురుగా ఉన్న బుజ్జమ్మ సత్రంలో కొందరు వ్యక్తులు పాల్పడిన ఆక్రమణలను గురువారం రాత్రి తొలగించారు. ఇందుకు సంబంధించి తెలిసిన సమాచారం మేరకు.. దశాబ్దాల క్రితం రంగనాథస్వామి భక్తురాలు బుజ్జమ్మ ఆ మార్గంలో భక్తుల కోసం దేవదాయ శాఖ పరిధిలో సత్రాన్ని నిర్మించారు. కాలక్రమేణా ఆ సత్రాన్ని ఒకరు లీజుకు తీసుకొని పైకాన్ని చెల్లించేవారు. అయితే తొలుత లీజు తీసుకున్న వ్యక్తి తన తదనంతరం మరికొందరికి అప్పగించి లీజు చెల్లించాలని వివరించారు. ఈ క్రమంలో లీజు తీసుకొన్న వ్యక్తి, ఆయన తరువాత లీజు తీసుకొన్న వారు ఎలాంటి పైకం చెల్లించకపోవడంతో బకాయిలు పేరుకుపోయాయి. ఈ క్రమంలో అధికార యంత్రాంగం పలు పర్యాయాలు బకాయిదారులకు నోటీసులు జారీ చేసింది. అయితే ఎలాంటి స్పందన లేకపోవడంతో దేవదాయ శాఖ నిబంధనల మేరకు పోలీసు, రెవెన్యూ, విద్యుత్ తదితర శాఖల సమన్వయంతో ఆక్రమణలు తొలగించారు. జిల్లా దేవదాయశాఖ అధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి, అరణి కందప్ప మేస్త్రీ సత్రం ఈఓ ఉష, వివిధ దేవస్థానాల ఈఓలు ఆక్రమణల తొలగింపును పర్యవేక్షించారు. ఈ క్రమంలో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది.